ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు

- ఎంపీ కేశినేని నాని
- 6 గ్రామాల్లో రూ.4.42కోట్లతో 15 ప్రభుత్వ భవనాల నిర్మాణం
- భవనాలను ప్రారంభించిన ఎంపీ


గంపలగూడెంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ కేశినేని నాని, స్వామిదాసు

గంపలగూడెం: ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం అని ఎంపీ కేశినేని శ్రీనివాస రావు (నాని) అన్నారు. మండలంలోని ఆరు గ్రామాల్లో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌సెంటర్ల నిర్వహణ నిమిత్తం నిర్మించిన భవనాలను ఎంపీ కేశినేని నాని సోమవారం ప్రారంభించారు. ఒకేసారి ఇన్ని భవనాల ప్రారంభోత్సవం పండుగలా పార్టీ శ్రేణుల కేరింతల మధ్య సాగింది. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ సభ్యులు కేశినేని శ్రీనివాసరావు (నాని), వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసుతో కలిసి ప్రారంభించారు. మండలంలోని అనుముల్లంక, గంపలగూడెం–2, కొణిజెర్ల, దుందిరాలపాడు, చింతనర్వ, మేడూరు గ్రామాల్లో రూ.4.42 కోట్లతో భవనాలను నిర్మించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీ సూచించారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నర్సారెడ్డి, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమా, బొల్లా కరుణాకరరావు, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు కే నరశింహారావు, మాజీ ఎంపీపీ కోట దాను, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఏఓ సాయిశ్రీ, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్‌లు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రభుత్వం చర్యలు

ఊటుకూరు(గంపలగూడెం): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకై జల్‌జీవన్ మిషన్‌పథకం ద్వారా తగిన చర్యలు తీసుకొంటోందని ఏపీ ఫైబర్‌గ్రిడ్ చైర్మన్ పీ గౌతమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊటుకూరులో ప్రతి ఇంటికీ తాగునీటి వసతి కల్పనకై రూ.28 లక్షల జల్‌జీవన మిషన్ నిధులతో ఏర్పాటు చేయనున్న పైపులైన్ ఏర్పాటు, రెండు బోర్ల తవ్వకం పనులను విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని), గౌతమ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ సమన్వయ కర్త నల్లగట్ల స్వామిదాసుతో కలిసి ప్రారంభించారు. ఊటుకూరులో రూ.35 లక్షల ఖర్చుతో నిర్మించిన 12 సిమంట్ రహదార్లను వారు ప్రారంభించారు.


ఊటుకూరులో జల్‌జీవన్ మిషన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, గౌతమ్‌రెడ్డి, స్వామిదాసులు

పెట్రోలు బంక్ ప్రారంభం..

పెనుగొలనులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీ బంక్‌ను, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి, ఎంపీలు ప్రారంభించారు. సొసైటీల ద్వారా రైతు అవసరాలకు రుణాలనే కాకుండా ప్రజలకు అందజేస్తున్న ఇతర సేవల్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు ఆలపాటి ఉమా, పార్టీ జిల్లా నాయకులు జీ చెన్నకేశవరెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరు, కొణిజెర్లల్లో వైఎస్సార్ విగ్రహాల ఆవిష్కరణ

ఊటుకూరు/కొణిజెర్ల(గంపలగూడెం): ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ సభ్యులు కేశినేని శ్రీనివాసరావు(నాని)తెలిపారు. మండలంలోని ఊటుకూరులో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ గౌతమ్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. కొణిజెర్లలో పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నెలకొల్పిన వైఎస్సార్ విగ్రహాన్ని ఎంపీ, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎంపీ మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పథకాల అమల్లో రాజకీయవివక్షత లేకుండా లబ్ధిదార్లు ఎంపికచేశారన్నారు. ప్రజలకు మరింత మేలు చేకూరాలంటే వచ్చే ఎన్నికల్లో ఓటర్లు వైఎస్సార్ సీపీకి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరో పర్యాయం ప్రభుత్వం ఏర్పాటుకు తోడ్పడాలన్నారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్మికుల సమస్యలకు కృషి చేస్తుందని గౌతమ్‌రెడ్డి వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆలపాటి ఉమామహేశ్వరరావు, బొల్లా కరుణాకరరావు, ఎంపీపీ జీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్, కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రహంతుల్లా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఊటుకూరులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న ఎంపీ నాని, గౌతమ్‌రెడ్డి తదితరులు

రూ.40 లక్షల డివిడెండ్ అందజేత



వావిలాల(తిరువూరు): మండలంలోని వావిలాల శ్రీ కృష్ణదేవరాయ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులకు గత 7 సంవత్సరాలకు డివిడెండ్‌ను సోమవారం అందజేశారు. 1727 మంది సభ్యులకు రూ.40 లక్షల మేర డివిడెండ్‌ను సొసైటీ అధ్యక్షుడు కొమ్మినేని కిషోర్, తిరువూరు కేడీసీసీ బ్యాంకు మేనేజరు ఆజాద్, సూపర్‌వైజర్ కొండయ్య, సీఈవో కోల సూర్యారావు పంపిణీ చేశారు. సహకార సంఘం స్థాపించిన నాటి నుంచి ఇంతవరకు సభ్యులకు డివిడెండ్ పంపిణీ జరగలేదని అధ్యక్షుడు కిషోర్ తెలిపారు.

నేడు వలంటీర్లకు సత్కారం

చాట్రాయి: ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం చాట్రాయి మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ మంగా కుమారి తెలిపారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

- విస్సన్నపేట: గ్రామ వలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానోత్సవం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.విజయకుమారి సోమవారం తెలిపారు. సేవా వజ్ర, సేవారత్నం, సేవామిత్ర పురష్కరాలు అందజేస్తామన్నారు.

నేడు ముసునూరులో..

ముసునూరు: సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలకు ఎంపికైన గ్రామ వలంటీర్లను మంగళవారం ఉదయం ముసునూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు సత్కరించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన పాస్టర్లు



ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్‌ను మైలవరం మండలానికి చెందిన పలువురు చర్చి పాస్టర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ బడుగు బలహీన వర్గాల నాయకుడు బుర్రి ప్రతాప్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో మంత్రిని కలిసి పరిచయం చేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీసీ వర్గానికి చెందిన నియోజకవర్గం ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు యాదవ్‌ను బలపర్చి పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు. వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతకు పరామర్శ

ఇబ్రహీంపట్నం: స్థానిక శక్తినగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న కూచిపూడి సునీల్‌ను వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి నల్లమోతు సుభాష్ సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం తన చేయూత ఫౌండేషన్ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

జి.కొండూరు(మైలవరం): ప్రతి ఒక్కరూ పరిపూర్ణమైన ఆరోగ్యంగా ఉండాలని మైలవరం ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు కే అనిల్ ఫ్రాన్సిస్ తెలిపారు. మైలవరం ఆర్‌సీఎం చర్చి, స్థానిక తేజస్వీ ఆసుపత్రి యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని బీమవరప్పాడు గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విచారణ గురువు అనిల్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం సేవలను పేదలు, బలహీనవర్గాలు, గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ సతీష్ 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

నేడు వాసవీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తిరువూరు: తిరువూరు వాసవీ క్లబ్, అనుబంధ క్లబ్బుల కొత్త కార్యవర్గాల ప్రమాణ స్వీకారం మంగళవారం ఉదయం జరుగుతుందని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నాళ్ల వెంకట రామారావు తెలిపారు. రుక్మిణీకృష్ణ ఆర్యవైశ్యకల్యాణ మండపంలో ఆయా క్లబ్బుల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో జిల్లా గవర్నర్ సతీష్‌కుమార్ ప్రమాణస్వీకారం చేయిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు

తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచలస్వామి దేవస్థానంలో తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా మూడోరోజు అధ్యయనోత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు, ఆస్థానాచార్య విఠలాచార్యులు ఆధ్వర్యంలో నమ్మాళ్వార్ల పరమపదోత్సవం, సేవాకాలం నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణ జరుగుతుందని అర్చకులు తెలిపారు.

ఏకాగ్రతతో చదవండి



తిరువూరు: స్థానిక గీతమ్స్ స్కూలులో పదో తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సీఐ అబ్దుల్ నబీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లు, టీవీల జోలికి పోవద్దని, పరీక్షలు పూర్తయ్యే వరకు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంటు ఎస్‌ఎస్‌బీ చారి, తెలుగు అధ్యాపకులు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నేటి నుంచి బాల రావమ్మ తల్లి తిరునాళ్ల

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో దుగ్గిరాల బాల రావమ్మ తల్లి మాఘపూర్ణిమ తిరునాళ్లు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ చైర్మన్ మాదల బుజ్జి తెలిపారు. ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహిస్తామన్నారు. 20న శోభనాపురం, 21న వడ్లమాను, 22న చొప్పరమెట్ల, 23న సింగన్నగూడెం గ్రామాల్లో బాలరావమ్మ తల్లి గ్రామోత్సవం నిర్వహిస్తామని వివరించారు. అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు, పాల పొంగళ్లతో పాటు 24న ఉదయం అన్నదానం చేస్తామన్నారు. ఆలయాల్లో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జగనన్న లేఅవుట్లలో గుంటుపల్లి లబ్ధిదారుల స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఎంపీపీ పాలడుగు జోత్స్న సోమవారం భూమిపూజ చేశారు. లేఅవుట్‌లో ఇప్పటికే కొండపల్లి పట్టణానికి చెందిన 1,515 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. గుంటుపల్లి లబ్ధిదారులకు కేటాయించిన లేఅవుట్‌లో మెరక పనులు ఆలస్యం అయ్యాయి. ఇటీవల కాలంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న, దుర్గాప్రసాద్ దంపతులు సొంత నిధులతో మెరకపనులు చేయించి ప్లాట్లు కేటాయించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావడంతో భూమిపూజ చేశారు. ఈవోపీఆర్డీ మనోజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు, పాలడుగు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ పాలడుగు జోత్స్న, అధికారులు

స్పందన అర్జీలు గడువులోపే పరిష్కరించాలి

ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: స్పందనలో వచ్చిన అర్జీలను గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆర్డీఓ వై.భవానీశంకరి ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డివిజన్‌లోని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు స్పందనలో అర్జీలు అందజేస్తున్నారని, ఈ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకవేళ సమస్య పరిష్కారానికి వీలులేకపోతే సంబంధిత కారణం తెలియజేయాలని అన్నారు. ఈ స్పందనలో 10 అర్జీలు రాగా, వాటిని ఆన్‌లైన్ చేసి సంబంధిత అధికారులకు పంపామన్నారు. ఆక్రమణలు తొలగించాలని, భూమి వివరాలను ఆన్‌లైన్ చేయాలని, సర్వే చేయాలని తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, సీడీపీఓ ఎస్‌వై.నూరాని, ఉద్యాన అధికారిణి ఆర్.హేమ, పలు శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నూజివీడులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ భవానిశంకరి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నూజివీడు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. మొర్సపూడి, మీర్జాపురం, మర్రిబంధం, సీతారామపురం, పల్లెర్లమూడి, ఎం.ఎన్.పాలెం పంచాయతీల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్ సదుపాయం, టాయ్‌లెట్స్, ఫర్నీచరు, తాగునీరు, వికలాంగులకు ర్యాంప్, ప్రహరీ తదితర సదుపాయాలను పరిశీలించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను సేకరించారు. పోలింగ్ ప్రశాంతగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లకు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్టు ఎంపీడీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు, తదితరులు ఉన్నారు.


మీర్జాపురంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కిరణ్‌కుమార్

గరుడ వాహనంపై శోభనాచలుడు



ఆగిరిపల్లి: శోభనాచల రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీ నృసింహుడు చిన్న గరుడవానంపై భక్తులు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారి కల్యాణ మండపంలో వలివేటి శేష శోభనాచల శ్రీనివాసరావు దంపతులు, వలివేటి హేమ శ్రీధర్ దంపతుల కైంకర్యంలో స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాత్రి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి చిన్న గరుడవానంపై గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలి

నూజివీడు: ఫ్యాకల్టీ ఇన్‌చార్జి బాధ్యతలను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో ఇద్దరిని ఫ్యాకల్టీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ చంద్రశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫిజిక్స్ విభాగంలో మెంటార్‌గా పనిచేస్తున్న ఎ.బ్రహ్మాస్వాములును ఇన్‌చార్జి డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాలురు)గా, ఇంగ్లిషు విభాగంలో మెంటార్‌గా పనిచేస్తున్న టి.దుర్గాభవానీని ఇన్‌చార్జి డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాలికలు)గా నియమించారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలు నిర్వహించిన వారికి వీడ్కోలు పలికారు. మెంటార్లు స్రవంతి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



నేడు వైద్య శిబిరం

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం మండలంలోని అక్కిరెడ్డిగూడెం సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ, నోడల్ అధికారి సీహెచ్ పద్మావతిదేవి, వైద్యాధికారి కరీముల్లా తెలిపారు. ఈ క్యాంపులో ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు అవినాష్, షకీనా ఇవాంజిలిన్, భవాని, మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

క్షీర బంధు చెక్కు అందజేత



విస్సన్నపేట: స్థానిక పాల కేంద్రంలో పాలు పోస్తున్న పాల ఉత్పత్తిదారు నెక్కళపు అనసూర్యమ్మ ఇటీవల మృతి చెందగా కృష్ణా క్షీరబంధు పథకంలో రూ.50 వేల విలువైన చెక్కును మృతురాలి కోడలు రాజ్యలక్ష్మికి సోమవారం అందజేశారు. సంఘం అధ్యక్షురాలు, పాలవకర్గ సభ్యురాలు నెక్కళపు వాణిశ్రీ, తిరువూరు పాల సీతలీకరణ కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి చేతుల మీదుగా చెక్కు అందజేశారు.

శివాజీ మహారాజ్ ఆదర్శనీయుడు

ముసునూరు: మొఘల్ చక్రవర్తులను ధీటుగా ఎదుర్కొన్న సాహసికుడు, మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, హిందూ మత ఔన్నత్యాన్ని దశ దిశలా చాటిన వీరుడు శివాజీ మహారాజు జీవితం నీతిమయం, ఆదర్శవంతమైందని మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు కూసం మార్కండేయులు అన్నారు. ముసునూరు మండలం చెక్కపల్లిలో సోమవారం ఆ సమాఖ్య ఆధ్వర్యంలో శివాజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక కళాకారులు కూసం నాగరాజు, కాటేపల్లి సుబ్బారావు, సీతారామయ్య, అన్నవరపు సత్యం తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ముసునూరు: మండలంలోని బలివేలో యార్లగడ్డ దుర్గారావు (30) అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు సోమవారం సాయంత్రం అరెస్ట్ చేశారని ఎస్‌ఐ పి.వాసు తెలిపారు. దుర్గారావు నుంచి 17 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితుడిని మంగళవారం నూజివీడు కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

మహిళా విద్యతోనే మెరుగైన సమాజం

ప్రవాసాంధ్రులు డాక్టర్ హనిమిరెడ్డి

మైలవరం: మహిళల విద్య దేశాభివృద్ధికి పునాది అని ప్రవాసాంధ్రులు, విద్యాదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేకంగా విశ్రాంతి గదిని సోమవారం ఆయన ప్రారంభించారు. విశ్రాంతి గదిలో విద్యార్థినులు భోజనం చేయడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, ప్రత్యేకంగా చదువుకోవడానికి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థినులకు అవసరమైన శానిటరీ నాప్‌కిన్లు పొందవచ్చన్నారు. ఎవరైనా విద్యార్థినులు అస్వస్థతకు గురైతే విశ్రాంతి తీసుకోవడానికి కర్టెన్స్‌లో బెడ్ ఏర్పాటు చేశామన్నారు. సమగ్రమైన లేడీస్ వెయిటింగ్ హాల్ ప్రారంభించిన డాక్టర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఇటువంటి సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మరిన్ని సానుకూలమైన విద్యా పరిస్థితులు నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. మెరుగైన సమాజం కోసం మహిళావిద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి, మహిళా సాధికారత విభాగం కో ఆర్డినేటర్ బి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ హనిమిరెడ్డితో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు

మండల ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం

తోటమూల(గంపలగూడెం): ఆర్యవైశ్య సంఘీయులు సమాజ సేవలో ముందుండి ప్రజల అభిమానం మరింతగా పొందాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. మండల ఆర్యవైశ్యసంఘం, మహిళా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆదివారం రాత్రి ఆయన మాట్లాడారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వేములపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కోరుకొండ రాంబాబు, కోశాధికారిగా నాళ్ల లక్ష్మణరావు తదితరులతో సత్యనారాయణ ప్రమాణం చేయించారు. మండల మహిళా సంఘం అధ్యక్షురాలిగా వనమా సుజాత, ప్రధాన కార్యదర్శిగా వనమా సత్యవాణి, పద్మనాభుని శైలజ, కోశాధికారిగా వజినేపల్లి మాధురి, పాలకవర్గ సభ్యులతో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కే రజని ప్రమాణం చేయించారు. ఆర్యవైశ్య ప్రతినిధులు కంచర్ల ముత్యప్రసాద్, రతికంటి రామచంద్రరావు, బొగ్గవరపు రాజారావులు తదితరులు పాల్గొన్నారు.


మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న రామకృష్ణ

అమ్మవారికి మొక్కులు చెల్లింపు

లింగగూడెం(పెనుగంచిప్రోలు): రంగుల ఉత్సవం పూర్తి చేసుకొని శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారుతోపాటు సహ దేవతల విగ్రహాలు సోమవారం సాయంత్రానికి మండలంలోని లింగగూడెం గ్రామానికి చేరుకున్నాయి. మహిళలు అమ్మవార్లకు ఎదురేగి వార్లుపోసి కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. అమ్మవార్లను నిలిపిన స్థలం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లకీల వెంట వచ్చిన వారికి గ్రామస్తులు భోజన వసతి ఏర్పాటు చేశారు. పల్లకీల రాకతో లింగగూడెంలో పండుగ వాతావారణం నెలకొంది. బంధువులు, స్నేహితులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. కార్యక్రమంలో సర్పంచి బరిగెల మంగమ్మ, పెనుగంచిప్రోలు ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు బరిగెల నాగరాజు, ఉపసర్పంచి బి.వెంకటరెడ్డి, నాయకులు ఏనుగుల ధర్మారెడ్డి, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


లింగగూడెంలో నిలిపి ఉంచిన అమ్మవారి పల్లకీలు

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థి ప్రతిభ

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ అండర్–7 విభాగంలో మైలవరం వివేకానంద విద్యార్థి ఆదూరి సర్జన్ ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పీ రాజారెడ్డి, ఎం. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఈ నెల 18 ఆదివారం విజయవాడ గుణదలలోని డాన్ బాస్కో స్కూల్‌లో జరిగాయన్నారు. ప్రథమ బహుమతి పొందిన ఆదూరి సర్జన్‌ను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పీ రాజారెడ్డి, ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

జగ్గయ్యపేట: రహదారి భద్రతపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని ప్రాంతీయ రవాణా శాఖాధికారి రవికుమార్ సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక వివాన్, సిటీ సెంట్రల్, చేగు, నారాయణ, చైతన్య పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం ఆయన రహదారి భద్రత కోసం పాటించాల్సిన సూచనలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆర్టీవో కార్యాలయ సిబ్బంది ఆలాం, విజయభాస్కర్ పాల్గొన్నారు.